క్లుప్తంగా

శ్రీశైలం బయలుదేరిన శివ స్వాములు



సిద్ధాంతం నుంచి శ్రీశైలం బయలు దేరిన శివస్వాములు

పెనుగొండ: సిద్ధాంతం నుంచి గురుస్వామి నక్కా సూర్యనారాయణ స్వామి ఆధ్వర్యంలో 42 రోజులు శివమాల ధరించిన సుమారు 45 మంది శివ స్వాములు సోమవారం శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. ఉదయం నుంచి ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, శివ స్వాములు గ్రామోత్సవం నిర్వహించి బయలుదేరి వెళ్లారు. భక్తి శ్రద్ధలతో శివమాలలు ధరించి ప్రతి రోజూ కార్తీకమాసంలో తెల్లవారు జామున నగర సంకీర్తనలు చేశారు.

దివ్యాంగుల స్కూల్‌లో ఆటల పోటీలు



ఆటల పోటీల్లో పాల్గొన్న దివ్యాంగ విద్యార్థులు

పాలకొల్లు అర్బన్: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని సబ్బేవారిపేట అంజలి మానసిక వికలాంగుల పాఠశాలలో రూరల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. 50, 100 మీటర్ల పరుగు పందెం, షాట్ పుట్, డిస్కస్ త్రో, పలు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విజేతలకు మూడో తేదీన బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె.జయభారత్‌రెడ్డి, అందే భాను ప్రకాష్, కోశాధికారి టీవీఆర్ సురేష్, అంజలి సంస్థ సెక్రటరీ వీడీవీ ప్రసాదరావు, ప్రిన్సిపాల్ ఎంపీఎస్ ప్రత్యూష, కోఆర్డినేటర్స్ వీఎస్ఎస్ నారాయణ, సీహెచ్‌వీవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా గణేష్



ముద్దాడ గణేష్ భవానికి నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: జాతీయ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడిగా పాలకొల్లుకు చెందిన ముద్దాడ గణేష్‌భవాని రెండోసారి నియమితులయ్యారు. సంఘ సమావేశం విజయవాడలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వెలగణ నూకానమ్మ, రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గా నరేష్ చేతుల మీదుగా గణేష్‌భవాని నియామక ఉత్తర్వులు అందుకున్నట్లు విలేకరులకు తెలిపారు.

క్రిస్మస్ సంబరాలు ప్రారంభం



పెనుగొండలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ స్టార్

పెనుగొండ: క్రిస్మస్ సంబరాలు సంబరాలు ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో పలు చర్చిలపై స్టార్లను ఏర్పాటు చేశారు. పెనుగొండలో సెయింట్ జాన్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో సుమారు 15 అడుగులు పొడవు గల స్టార్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలువురు సంఘ పెద్దలు యూత్ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

భగవద్గీత పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకున్న విద్యార్థులు

నరసాపురం రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాశాఖ ఆధ్వర్యంలో మొగల్తూరులో నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో నరసాపురం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు తాడిమేటి కృష్ణవేణి శిష్యులు పది మంది విద్యార్థులు జూనియర్, సీనియర్, మహిళల విభాగాల్లో బహుమతులు సాధించారు. టీటీడీ జిల్లా అధ్యక్షులు బీఎస్ఆర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో నరసాపురం పట్టణానికి చెందిన కృష్ణవేణి, సవరం హోత్రీ చందన, కె.లాస్యగౌరి, శ్రీను, కె.దుర్గా శ్రీనివాసవర్మ, ఎ.మాన్యశ్రీ, ఎ.మనోజ్ఞ బహుమతులు సాధించారు.

ధాన్యం కొనుగోలుమాల్



పాలకొల్లు అర్బన్: మిషన్ ద్వారా కోత కోస్తున్న రైతులు



నరసాపురం: రోడ్డు పక్కన ఆరబెట్టిన ధాన్యం

- అంతంతమాత్రంగానే ధాన్యం కొనుగోళ్లు
- దళారుల చేతికే ధాన్యం
- ప్రభుత్వ సహకారం కేవలం ప్రకటనలకే పరిమితం
- ఆవేదనలో తీరప్రాంత రైతాంగం

నరసాపురం: ఆరుగాలం శ్రమించి పంటపండించిన రైతులకు ధాన్యం అమ్మకాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతీ గింజకు కనీస మద్దతు ధర ఇచ్చి రైతుసేవా కేంద్రాల్లో కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతుతున్న మాటలు కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితమయ్యాయి. రైతుసేవా కేంద్రాల్లో సరైన న్యాయం జరగడం లేదని రైతులు చెబుతున్నారు. ఇక గత్యంతరం లేక పండించిన ధాన్యాన్ని రైతులు దళారుల చేతిలోనే పోస్తున్నారు. సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్న నరసాపురం నియోజకవర్గంలో రైతులు తీవ్ర ఆవేదనలో ఉన్నారు.

1336 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు

నియోజకవర్గంలో నరసాపురం మండలంలో 3,631 ఎకరాలు, మొగల్తూరు మండలంలో 640 ఎకరాలు మొత్తంగా 4,271 ఎకరాల్లో సార్వా పంట సాగు చేశారు. దాదాపు 80 శాతం వరకూ కోతలు పూర్తయ్యాయి. పండిన పంటకు సంబంధించి మొత్తంగా సుమారు 8,062 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి ఉంటుంది. కానీ ఇప్పటి వరకూ రైతుసేవా కేంద్రాల ద్వారా కేవలం 1336 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. మిగిలిన 6724 మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్మకాలు దళారుల చేతిలోనే రైతులను పెట్టినట్టుగా అర్థమవుతుంది.

ప్రకటనలకే పరిమితం

సార్వా కోతల సమయం నుంచి అధికారులు రైతులు రైతుసేవా కేంద్రాల ద్వారానే ధాన్యం అమ్మకాలు సాగించాలంటూ ప్రచారం ఊదరగొట్టారు. దళారులు ధాన్యం కొనుగోలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కానీ వాస్తవంలో అదేమీ అమలులోకి రాలేదు. రైతుసేవా కేంద్రం ద్వారా ధాన్యం అమ్మకాలు చేస్తే 24 గంటల్లోనే రైతుఖాతాల్లో నగదు జమ చేస్తామని చెబుతున్నారు. అయితే ఇవి ప్రకటనలకే పరిమితమవుతున్నాయని రైతులు వాపోతున్నారు.

పంటను కబలిస్తున్న దళారులు

పాలకొల్లు అర్బన్: రైతుల బలహీనతలను దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. ధాన్యం కొనుగోలులో దళారుల జోక్యం పెచ్చుమీరుతుంది. చేను మీద ఉన్న పంటను కబళిస్తున్నారు. కొట్టు పట్టు విధానంలో కోసింది కోసినట్టుగా దళారులు దోచుకుంటున్నారు. క్వింటాలుకు రూ.300 నుంచి రూ.400 వరకు రైతులు నష్టపోతున్నారు. పాలకొల్లు మండలంలో సార్వా మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఫెంగల్ తుపాన్ బూచిగా చూపించి దళారులు రెచ్చిపోతున్నారు. మండలంలో 9,024 ఎకరాల్లో సార్వా వరి సాగు చేశారు. ఇప్పటి వరకు 2,650 ఎకరాలు ఇప్పటి వరకు కోతలు పూర్తయ్యాయి. 1197 మంది రైతులకు చెందిన 6545 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించారు.

కొనుగోలులో దళారుల ప్రమేయం



సార్వా పంట కొనుగోలులో దళారుల ఇష్టారాజ్యమయ్యింది. పంట చేను మీద ఉండగానే దళారులు రైతుతో బేరం కుదుర్చుకుని కొనుగోలు చేస్తున్నారు. ఉబ్బడాలు కోసింది కోసినట్టుగా ఓ ధర నిర్ణయించి రైతుల చేతిలో పెడుతున్నారు. ఎకరాకు రూ.300 వరకు రైతులు నష్టపోతున్నారు.

తండా ఇస్సాక్‌రాజు, కౌలు రైతు, ఎస్.చిక్కాల

రైతుల పంట దళారుల పాలు

పెనుగొండ: ఆరుగాలం కష్టపడి పండించుకున్న పంట దళారుల పాలవుతుంది. ప్రతీ గింజా కొనుగోలు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వం ఆచరణలో మాత్రం శూన్యంగా ఉంది. దీంతో ఫెంగల్ తుపాన్ వంకతో దళారులు విజృంభిస్తున్నారు. 75 కేజీల బస్తాకు రూ.200 తగ్గించి మరీ దళారులు పంటను మళ్లించేస్తున్నారు. ప్రభుత్వ ధర ప్రకారం 75 కేజీల బస్తా రూ.1725 మద్దతు ధర ఉండగా, రూ.1525 చెల్లిస్తున్నారు. దీంతో రైతులు దాదాపుగా రూ.10 వేలు నష్టపోవలసిన పరిస్థితి ఏర్పడతుంది. తేమ శాతం, తుపాన్లతో మరింత నష్టపోతారంటూ దళారులు రైతును మభ్య పెడుతున్నారు. దళారులు మాత్రం దర్జాగా రైతుసేవా కేంద్రం ద్వారా పూర్తి ధర పొందుతుండడం విశేషం. ఆచంట నియోజకవర్గంలోని ఆచంట మండలంలో 10015 ఎకరాల్లోనూ, పోడూరు మండలంలో 12790 ఎకరాల్లోనూ, పెనుగొండ మండలంలో 11750 ఎకరాల్లోనూ, పెనుమంట్ర మండలంలో 12156 ఎకరాల్లో సాగు చేస్తుండగా, ఆచంట మండలంలో 3675 మెట్రిక్ టన్నులు, పోడూరు మండలంలో 5100 మెట్రిక్ టన్నులు, పెనుమంట్ర మండలంలో 5865 మెట్రిక్ టన్నులు, పెనుగొండ మండలంలో 6500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుసేవా కేంద్రాల ద్వారా మిల్లులకు చేర్చుకున్నారు. వీటిలో 20 శాతానికి పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం దళారుల ద్వారా మిల్లులకు చేరినట్లు అంచనా వేస్తున్నారు.



పెనుగొండ: తూర్పుపాలెంలో ధాన్యం పట్టుబడి పడుతున్న రైతులు

బీచ్‌లో ముగిసిన కార్తీకమాసం సందడి

మొగల్తూరు: కార్తీక వనసమారాధన పేరుతో ప్రతి ఏటా కార్తీకమాసంలో లక్షలాది మంది పర్యాటకులు బీచ్‌కు తరలి వస్తారు. బీచ్‌కు వచ్చే పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తారు. అయితే బీచ్‌కు వచ్చే సందర్శకులు సముద్ర స్నానం చేయకుండా వెళ్లరు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి బీచ్‌లుగా నామకరణం చేసిన కేపీపాలెం, పేరుపాలెం బీచ్‌లకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి యువతీ యువకులు, చిన్న, పెద్ద భారీగా తరలి వస్తారు. అయితే పేరుపాలెం బీచ్ కంటే కేపీపాలెం బీచ్‌లోనే పర్యాటకులు ఎక్కువగా సేదతీరేందుకు మొగ్గు చూపుతారు. ఈ ప్రాంతంలో సముద్ర స్నానం చేసేందుకు అనువుగా లేకపోయినా పర్యాటకులు ఎక్కువ మంది రావడంతో అధికారులు కూడా ఇక్కడే ఏర్పాట్లు చేస్తారు. ఈ ఏడాది నవంబర్ రెండున ప్రారంభమైన కార్తీకమాసం డిసెంబర్ ఒకటో తేదీతో ముగిసింది.

పలు జాగ్రత్తలు తీసుకున్న అధికారులు

ప్రతీ ఏటా కార్తీకమాసంలో బీచ్‌కు వచ్చే వారిలో ఇద్దరు లేదా ముగ్గురు గల్లంతైన సంఘటనలు ఉండటంతో ఈ ఏడాది పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఈ ఏడాది కార్తీకమాసం ఐదు ఆదివారాలు రావడంతో అధికారులు జాగ్రత్త చర్యలు పటిష్టం చేశారు. కార్తీకమాసంలో ఆఖరి ఆదివారం తుఫాన్ కారణంగా పర్యాటకుల రాకను నిషేధించారు. సందర్శకులు సముద్ర స్నానం చేసే ప్రాంతంలోనే కాకుండా తీరం పొడవునా పోలీసులు గస్తీ నిర్వహించి సందర్శకులు ఎవరూ రాకుండా పూర్తి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది కార్తీకమాసంలో సుమారు 50 నుంచి 60 వేల మంది సందర్శకులు బీచ్‌కు వచ్చి ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. బారికేడ్లు దాటి ఎవరూ వెళ్లకుండా 15 నుంచి 20 మంది గజ ఈతగాళ్లను నియమించడంతో పాటు డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐ పర్యవేక్షణలో నలుగురు ఎస్సైలు, 95 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. దీంతో ఈ ఏడాది కార్తీకమాసంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



కేపీపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి (ఫైల్)

పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం



గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకుని పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం. బీచ్‌కు వచ్చే వారు మద్యం సేవించి రాకుండా కట్టడి చేయడమే కాకుండా బారికేడ్లు దాటి వెళ్లకుండా గజ ఈతగాళ్లతోపాటు తమ సిబ్బంది కూడా విధుల్లో పాల్గొనేలా చర్యలు తీసుకున్నాం. అధికారులు కూడా ఆదివారం రోజు తరుచూ పర్యటించి తమకు పలు సూచనలందించేవారు. దీంతో ఎటువంటి అవాంఛనయ సంఘటనలు జరుగుకుండా చూడగలిగాం.

జి.వాసు, ఎస్సై, మొగల్తూరు

నిరంతరం పర్యవేక్షించాం



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిరంతర పర్యవేక్షించాం. కార్తీకమాసంలో బీచ్‌కు వచ్చే సందర్శకులు తిరిగి సంతోషంగా వెళ్లాలనే ఉద్దేశ్యంతో సిబ్బందిని పూర్తిగా వినియోగించుకున్నాం. స్థానిక సిబ్బందితో సలహాలు సూచనలు తీసుకుని పటిష్ట చర్యలు చేపట్టాం.

కె.రాజకిశోర్, తహసీల్దార్, మొగల్తూరు

భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి



మొగల్తూరు: శివాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు



పాలకొల్లు సెంట్రల్: దీపాలు వెలిగిస్తున్న మహిళలు



పెనుగొండ: కేదారీఘాట్‌లో స్నానాలు చేస్తున్న భక్తులు

పెనుగొండ: కార్తీకమాసం ముగింపు సందర్భంగా పోలి పాడ్యమి పురస్కరించుకుని సోమవారం తెల్లవారు జామున సిద్ధాంతం వశిష్ఠ గోదావరి వద్ద కేదార్ ఘాట్ భక్తులతో కిటకిటలాడింది. గోదావరి మెట్లపై పసుపు, కుంకుమలతో పోలి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆచంటలో పోలి పాడ్యమి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రామగుండం చెరువులో స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వదిలారు. అనంతరం ప్రసిద్ధిగాంచిన ఆచంటేశ్వరునికి పూజలు అభిషేకాలు నిర్వహించారు.

పాడ్యమి దీపాలు వెలిగించిన మహిళలు

పెనుమంట్ర: కార్తీకమాసం పాడ్యమి సందర్భంగా సోమవారం తెల్లవారు జామున మహిళలు స్నానాలు ఆచరించి పెనుమంట్ర శ్రీకృష్ణ ఆలయం వద్ద ఉన్న గోస్తనీ రేవులో కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీకమాసంలో మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే నోము పోలిస్వర్గమునకు ప్రాచీన కాలంనుండి మహిళలను ప్రభావితం చేసేది. ఈనోము ఆశ్రియుజ అమావాస్య మొదటుకొని కార్తీక అమావాస్య వరకు ఉదయాన్నే లేచి స్నానంచేసి అనేక మంది భక్తులు కార్తీకమాసం చివరి రోజైన అమావాస్య పాడ్యమి నాడు దీపాలు వెలిగించి నదిలో వదిలితే నెల రోజులు పూజలు చేసిన ఫలితం వస్తుందని మహిళల నమ్మకం.

శివనామస్మరణతో మారుమోగిన శివాలయాలు

మొగల్తూరు: కార్తీక మాసం ఆఖరి సోమవారం మండలంలోని శివాలయాలన్నీ భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. వేకువ జాము నుంచి భక్తులు తరలి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. మొగల్తూరులో పురాతన పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని కార్తీక దామోదర పూజలు నిర్వహించారు.

పోలిస్వర్గం దీపాలు వదిలిన మహిళలు

పాలకొల్లు సెంట్రల్: కార్తీకమాసం ముగియడంతో సోమవారం వేకువ జామున మహిళలు పెద్ద సంఖ్యలో పోలి స్వర్గం దీపాలను వెలిగించారు. పూజా కార్యక్రమాలు ముగించారు. దీపాలను కాలువలో వదిలారు. అనంతరం కనకదుర్గమ్మ ఆలయం, వేంకటేశ్వరస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాల్లో, రావి, వేప, మర్రి వృక్షాల వద్ద దీపాలను వెలిగించారు. మహిళలు క్షీరారామరామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ఆలయంలో పాడ్యమి దీపాలను వెలిగించారు.

పోయి రావమ్మా పోలమ్మ

పాలకొల్లు అర్బన్: కార్తీకమాసం చివరి రోజైన సోమవారం మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. మండలంలోని ప్రధాన పంట కాలువల్లో పూజలు చేసి పోలమ్మను స్వర్గానికి సాగనంపారు. అలాగే వాయుత్రిలింగ క్షేత్రాలుగా ప్రసిద్ధి చెందిన శివదేవునిచిక్కాల శ్రీపార్వతీ సమేత శ్రీశివదేవస్వామిని, దిగమర్రులోని శ్రీ ఉమా నరేంద్రస్వామివార్లను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ముగిసిన కార్తీక పూజలు

నరసాపురం: కార్తీకమాసం పూజలు ఘనంగా నరసాపురం వశిష్ఠ గోదావరి తీరాన ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం చివరి రోజు సోమవారం రావడంతో తెల్లవారు జాము నుంచి గోదావరి ఘాట్‌లు భక్తులతో కిక్కిరిశాయి. భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమిపూజలు చేశారు. లలితాంభఘాట్, అమరేశ్వరఘాట్‌ల వద్ద పెద్ద ఎత్తున స్నానాలు చేశారు. కపిలమల్లేశ్వరస్వామి ఆలయం, గోదావరిగట్టున ఉన్న అమరేశ్వరస్వామి శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

వదలని వరుణుడు

మొగల్తూరు: తుఫాన్ ప్రభావంతో గత మూడు రోజులుగా చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి ఫెంగల్ తుఫాన్‌గా రూపాంతరం చెందడంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వరి రైతులు, ఆక్వా రైతులు ఆందోళనలో పడ్డారు. అయితే భారీ వర్షాలు కురవకపోయినా గత శనివారం నుంచి సోమవారం ఉదయం వరకు సుమారు 27 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. దీంతో వరి రైతులు కోసిన ధాన్యాన్ని జాగ్రత్తలు చేసుకోగా కోతకు వచ్చిన చేలను కోయకుండా వాయిదా వేసుకున్నారు. మరోవైపు తయారైన ఇటుకలు తడిసిపోతాయనే ఆందోళనతో వ్యాపారులు బరకాలు వేసి గాలికి ఎగిరిపోకుండా కట్టడి చేసుకున్నారు. మొగల్తూరులోని ప్రధాన రహదారిపైకి వర్షం నీరు చేరడంతో స్థానికులతో పాటు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

84 ఎకరాల్లో వరికి నష్టం

యలమంచిలి: గత రెండు రోజులుగా కురిసిన వర్షానికి మండలంలోని వివిధ గ్రామాలలో 84 ఎకరాల్లో వరి పంట తలలు వాల్చినట్లు ప్రాథమిక అంచనా వేశామని మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యలమంచిలి, మేడపాడు, అబ్బిరాజుపాలెం, బూరుగుపల్లి, కొంతేరు, గుంపర్రు గ్రామాలలో పంటకు నష్టం వాటిల్లినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ ఖరీఫ్ పంటకు మొత్తం 4412 ఎకరాలలో వరి సాగు చేయగా ఇంత వరకు 178 ఎకరాలలో కోతలు పూర్తనయినట్లు ఆమె వివరించారు.



గొల్లగూడెంలో రహదారిపైకి చేరిన వర్షపు నీరు

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం

యలమంచిలి: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న బండారు రామమోహన్‌రావు సోమవారం యలమంచిలి మండలంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మధుర నరసింహమూర్తి, రంకిరెడ్డి శ్రీనివాస్, సంకీర్త్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఏరులై పారుతున్న మద్యం

మొగల్తూరు: గ్రామాల్లో బెల్ట్ షాపులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించినా కూటమి నాయకులు యధేచ్ఛగా షాపులు ఏర్పాటు చేసుకుని దర్జాగా అమ్ముకుంటున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలను పాటించాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో మూడు నిబ్బులు ఆరు పుల్లులుగా వ్యాపారం సాగుతుంది. మొగల్తూరు మండలంలోని 17 గ్రామాలకు సంబంధించి ఐదు మద్యం దుకాణాలు కేటాయించగా మొగల్తూరులో రెండు దుకాణాలు ఏర్పాటు చేశారు. అయితే వ్యాపారులు సిండికేట్ కాకపోవడంతో ఎవరు ఇష్టమొచ్చినట్లు వారు వ్యాపారం చేసుకుంటున్నారు. దీంతో మండలంలో బెల్ట్ షాపులు అంటూ లేకపోయినా కాలువ గట్లు, చెరువు గట్లు, తోటల్లోనూ పెట్టి యధేచ్ఛగా మద్యం అమ్ముతున్నారు. ఇటీవల మండలంలోని ఓ గ్రామంలోని అధికార పార్టీ నాయకులు రూ.లక్షలు చెల్లించి, బెల్ట్ షాపు నిర్వహించుకునేలా ఒప్పందం చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో వైపు సీసాకు మాకు కొంత ఇవ్వాలంటూ కూటమిలోని మరో పార్టీ నాయకులు మద్యం వ్యాపారులపై ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మున్సిపల్ మాజీ చైర్మన్ నారాయణమూర్తి మృతి

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పట్టణ మునిసిపల్ తాజా మాజీ చైర్మన్ వల్లభు నారాయణమూర్తి (71) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఈయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య కోవిడ్‌లో మృతి చెందారు. ఈయన మృతి పట్ల మంత్రి నిమ్మల రామానాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు యడ్ల తాతాజీ, జనసేన నాయకులు బోణం చినబాబు, బీజేపీ నాయకులు జక్కంపూడి కుమార్, కబర్ది, మున్సిపల్ కమిషనర్ బి.విజయసారథి, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

వేప చెట్టుకు పూజలు



వేప చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని రామన్నపాలెం పంచాయతీ పులపర్తివారి తోటలో వేప చెట్టుకు పాలు కారడంతో భక్తులు భారీగా తరలి వచ్చి పూజలు చేస్తున్నారు. గ్రామంలోని పులపర్తి సత్యనారాయణ అనే యజమాని తోటలోని ఓ వేప చెట్టుకు సోమవారం ఉదయం నుంచి పాలు ధారగా కారుతున్నాయి. తోటలోకి వెళ్లిన కొందరు ఈ విషయం గమనించి స్థానికులకు సమాచారం అందించడంతో గ్రామస్తులు, భవానీలు పెద్ద ఎత్తున తరలి వచ్చి వేప చెట్టుకు పూజలు ప్రారంభించారు. ఈ నోటా ఆనోటా సమాచారం బయటకు పొక్కడంతో ఈ దృశ్యాన్ని చూసేందుకు గ్రామంలోని ఇతర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి రావడంతో సందడి నెలకొంది.

ప్రజా ఫిర్యాదులపై చర్యలు చేపట్టాలి



ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఆర్డీవో

నరసాపురం: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణం చర్యలు తీసుకోవాలని నరసాపురం ఆర్డీవో దాసి రాజు అధికారులను ఆదేశించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని ఆర్డీవో నిర్వహించారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఫిర్యాదులు, దరఖాస్తులు అందించారు. మొత్తం 26 ఫిర్యాదులు అందినట్టు ఆర్డీవో చెప్పారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. దరఖాస్తులకు సంబంధించి సమస్యల పరిష్కారం ఎంతవరకూ వచ్చిందనే అంశాన్ని ఎప్పటికప్పుడు తనకు నివేదిక ఇవ్వాలని తహసీల్దార్లకు ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్‌లోని పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.